క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ ఇస్తున్న నారాయణరెడ్డి

జహీరాబాద్ టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు నారాయణరెడ్డి అన్నారు. జహీరాబాద్ పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. యోగా, ధ్యానం సాధన చేయడం వల్ల కొంత వరకు సమస్యలు దూరమవుతాయన్నారు. యోగాపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు బరూర్ దత్తాత్రి, కృష్ణ, రమేష్, చక్రధర్, మధుసూదన్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెళ్లి కస్తూర్బా బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి 6,7,8 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడిమానేసినవారు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్రరేఖకు దిగువన ఉన్న విద్యార్థులే అర్హులన్నారు. అడ్మిషన్లు పొందేందుకు అందోల్ కేజీబీవీలో దరఖాస్తు చేసుకొని నేరుగా అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. మరిన్నీ వివరాల కోసం 8096823279 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీ (కస్తూర్బాగాంధీ విద్యాలయం)లో స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉందని, దాని కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి సంగీత పేర్కొన్నారు. స్కావెంజర్ పోస్టుకు 7వ తరగతి చదివిన మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు చదివిన సర్టిఫికెట్లతో ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

టేక్మాల్(మెదక్): కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకానికి ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్ ఆదివారం తెలిపారు. పట్టదార్‌పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో పాటు, రైతు భరోసా దరఖాస్తు ఫారంతో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



వినియోదారుడికి పెట్రోల్ పోస్తున్న ఎంపీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని చాల్కి చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆదివారం జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వాహన వినియోగాదారులకు ఎంపీ పెట్రోల్ పోశారు. వినియోదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏపీసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, నాయకులు పాల్గొన్నారు.

జేసీబీ సీజ్



అధికారులు సీజ్ చేసిన జేసీబీ

నర్సాపూర్‌రూరల్: అక్రమంగా మట్టి తరలింపునకు వినియోగిస్తున్న జేసీబీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు ఆర్‌ఐ ఫైజల్ తెలిపారు. మండలంలోని నత్నయ్యపల్లిలోని 119 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి నుంచి కొంత మంది అక్రమంగా జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా గత కొన్ని రోజుల నుంచి ఓ ప్రైవేటు వెంచర్‌కు పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చింది. దీంతో ఆదివారం వెళ్లి చూడగా అక్కడ జేసీబీ ఉంది. మిగతా జేసీబీలు ట్రాక్టర్లను మా రాకను తెలుసుకొని ముందే తరలించినట్లు చెప్పారు.

కనుమరుగవుతున్న కాడెడ్లు

- పెరిగిన యంత్రాల వినియోగం
- తగ్గుతున్న ఎద్దుల వాడకం
- ట్రాక్టర్లపైనే భారం



కాడెడ్లతో దున్నుతున్న రైతు

వెల్దుర్తి(తూప్రాన్): ఒకప్పుడు వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండే కాడెడ్లు నేడు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. యేడాదికేడాది పెరుగుతున్న యాంత్రీకరణ, జీవనం విధానం, పశుపోషణ భారం వెరసి కాడెడ్లు ఆదరణ కోల్పోతున్నాయి. దీంతో దుక్కులు దున్నాలన్నా, విత్తనం వేయాలన్నా రైతులు యంత్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఒకప్పుడు పశువుల పేడను పొలాలకు వేసేవారు. అదేవిధంగా పొలాల్లో కలుపులు తీయడానికి మూడు, నాలుగు సార్లు గుంతుకలు, కలుపు తీయించేవారు. పంట చేతికి రాగానే కాడెడ్లతో బండ్లు కట్టి పంటను ఇంటికి తెచ్చుకునేవారు. ప్రస్తుతం వీటి స్థానాన్ని యంత్రాలు ఆక్రమించాయి.

యాంత్రీకరణకు ప్రోత్సాహం

ఎక్కడ చూసినా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. మానవ వనరుల కొరతను అధిగమించి తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో పంటలను సాగుచేయడం కోసం ప్రభుత్వం యాంత్రీకరణను ప్రోత్సహిస్తుంది. అందులో భాగంగా వ్యవసాయానికి కావాల్సిన ట్రాక్టర్లతో పాటు వివిధ పరికరాలను, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందిస్తుంది. దీనికితోడు చాలా మంది రైతులు గ్రామాల్లో ట్రాక్టర్‌లు కొనుగోలు చేసి వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. వీటి ప్రభావం కూడా కాడెడ్లు దూరం కావడానికి కారణమవుతున్నాయి.

పశుపోషణ రైతుకు భారం..

ప్రస్తుతం మార్కెట్‌లో జత ఎడ్లు ఖరీదు రూ.50 వేలు నుంచి లక్ష రూపాయల వరకు పలుకుతుంది. దీనికితోడు కరువు కాలంలోనూ వాటిని పోషించడం రైతులకు భారమవుతుంది. సన్న, చిన్నకారు రైతులు అయితే దున్నడం మొదలుకొని పంటకోసే వరకు యంత్రాలతోనే చేయిస్తున్నారు. ఈ కారణంగా ఎద్దుల ఆవశ్యకత పల్లెల్లో రోజురోజుకూ గణనీయంగా తగ్గుతుంది. మరో విషయం ఏమిటంటే సేద్యం గిట్టుబాటు కాని రైతులు ఎడ్లను అమ్మేసి వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. రోజువారీగా పనులకు వెళ్తున్నారు.

కూలీల కొరతతో ఇక్కట్లు



యాంత్రీకరణ పెరిగినప్పటి నుంచి వ్యవసాయానికి కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో తప్పనిసరి పరిస్థితిలోనే యంత్రాలతో పనులు కానిచ్చేస్తున్నాం. యాంత్రీకరణ వల్ల డబ్బులు తక్కువ ఖర్చు కావడంతో పాటు పనులు త్వరగా పూర్తయి సమయం ఆదా అవుతుంది. కాడెడ్లతో గతంలో పొలం దున్నాలంటే కనీసం రెండురోజులైనా సమయం పట్టేది. కానీ నేడు ట్రాక్టర్‌తో కొన్ని గంటల్లోనే పొలం దున్నడం అయిపోతుంది. యంత్రాలతో పాటు ఎద్దులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం రాయితీపై రుణాలు అందిస్తే మాలాంటి పేద రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

- రాజు, రైతు, హస్తాల్‌పూర్



స్థలం పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరనాత చర్చికు 80 గజాలు, నాయిబ్రహ్మణ సంఘానికి కొమరంబీమ్ కాలనీలో కేటాయించిన 150 గజాల స్థలాలకు సంబంధించిన పత్రాలను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలాలకు సంబంధించిన పత్రాలను ఇచ్చామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ప్రభు, మాజీ కౌన్సిలర్‌లు నాగరాజు, శ్రీశైలం, లచ్చిరాం, బాలాజీ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం గ్రామంలోని ఓ కాలనీలో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వర స్వామి దేవాలయం భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించిన క్లబ్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీకి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలన్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు.. త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్షించి మంచినీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డ్ తరలించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు



అమ్మవారి ఆలయం చుట్టూ బండ్ల ఊరేగిస్తున్న రైతులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో గ్రామ దేవత మాత నల్ల పోచమ్మ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ప్రతియేడు మృగశిర కార్తెను పురస్కరించుకొని అమ్మవారికి పట్టణంలోని రైతులంతా తమ ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ ఊరేగిస్తారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి విశేష అలంకరణతో భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆరుగంటలకు రైతులు ఎడ్ల బండ్లను అమ్మవారి ఆలయం చుట్టూ ఊరేగించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

జహీరాబాద్: ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి- షాదీముబారక్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ నాయకులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు సభావేదికపై ఉండడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్‌తో పాటు ఆయా పార్టీల మండల నేతలు వేదికపై ఉన్నారు. ఇది అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. వేదికపై కూర్చోవడమే కాకుండా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందించడం ఏమిటని నిలదీశారు. ఈ విషయంలో అధికారులు తగిన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మునిపల్లి(అందోల్): ఈ నెల 23 వరకు మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో 2025–26 మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మాధవి ఆదివారం తెలిపారు. బి.కామ్, (సీ.ఏ. జనరల్ ఆనర్స్, బీఏ ట్యాక్సేషన్), బీ.బీ.ఏ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు రెవెన్యూ సదస్సులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. భూభారతిలో భాగంగా చిన్నగొట్టిముక్ల, సికింద్లాపూర్ గ్రామాల్లో సోమవారం నిర్వహించు రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విమానయానశాఖ మంత్రి రాజీనామా చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న తాజోద్దీన్

సదాశివపేట(సంగారెడ్డి): అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజోద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకి ఏవియేషన్ రంగంపై అనుభవం లేదని, మంత్రిగా కొనసాగితే దేశానికే ప్రమాదమన్నారు. ప్రమాదానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వం వహించి మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరప్ప, ముస్తఫా, అనసూజ, వెంకట్‌గౌడ్, సాదిక్‌అలీ, యాకుబ్, బిపాష, నర్సమ్మ పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు సత్కారం



నందినిని సన్మానిస్తున్న డీఎస్పీ సైదా

జహీరాబాద్ టౌన్: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి అత్యుత్తమ మార్కులు సాధించిన మండల టాపర్లను జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ సత్కరించారు. ప్రాఫిట్ షూ కంపెనీ నిర్వాహకులు ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని నందిని, బూచినెల్లి గురుకుల పాఠశాల విద్యార్థిని సంధ్యారాణిలు మండల టాపర్‌లుగా నిలిచారు. డీఎస్పీ సైదానాయక్ వీరిని ఘనంగా సత్కరించి అభినందించారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): వైద్య ఖర్చులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని గోమారం గ్రామానికి చెందిన ప్రవల్లిక అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో చికిత్స నిమిత్తం మంజూరైన రూ.75 వేల ఎల్‌ఓసీని ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుంట లక్ష్మణ్, నగేష్, నవీన్, దేవేందర్ పాల్గొన్నారు.

అక్రమంగా సెల్‌టవర్ నిర్మాణం



మాట్లాడుతున్న శంకర్ తదితరులు

చేగుంట(తూప్రాన్): దళితుల వ్యవసాయ భూమిలో అక్రమంగా సెల్‌టవర్ నిర్మాణం జరిపారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పొలంపల్లి గ్రామంలో 218 సర్వే నంబర్‌లో దళితుడు సత్యనారాయణ వ్యవసాయ పొలాన్ని శంకర్ ఆదివారం నిజనిర్ధారన సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సత్యనారాయణ భూమిలో ప్రైవేటు సెల్‌టవర్ నిర్మాణం జరపగా ఇతరులు సెల్‌టవర్ సంస్థ నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సత్యనారాయణకు న్యాయం చేయకుంటే ఎస్సీ, ఎస్టీ కమీషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, జాతీ య మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, స్వామి, బాధిత మహిళా మణెమ్మ పాల్గొన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకంచేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమ్మేళనం



జహీరాబాద్: రజతోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు



న్యాల్‌కల్ కేజీబీవీలో పూర్వ విద్యార్థినులు

జహీరాబాద్: పట్టణంలోని మెథడిస్ట్ రూరల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు రజతోత్సవ వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల డీఎస్ సుకుమార్, తెలుగు అధ్యాపకులు భాస్కర్‌రావు, గణిత శాస్త్ర అధ్యాపకులు చంద్రశేఖర్, సైన్స్ అధ్యాపకులు స్వరూపరాణి, పాస్టర్ ఇమాన్యుయేల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు.

న్యాల్‌కల్‌లోని కేజీబీవీలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీలో పూర్వ విద్యార్థినిల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2019–2020 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థినులు ఒక చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగీత, మాధవి, రత్నవేణి, జయశీల, స్వప్న, శారద, మమత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు సీఎం వీడియో కాన్ఫరెన్స్

పెద్దశంకరంపేట(మెదక్): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రభుత్వం 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. పెద్దశంకరంపేటలోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో వీసీ ద్వారా ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఓ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ నేడు భూభారతి సదస్సులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్, మహదేవుపల్లిలో సోమవారం భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నామని కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్ ఆదివారం తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

◆ సీసీరోడ్డు పనులకు శ్రీకారం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తీలో ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్న అధికారులకు కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం బస్తీలో మున్సిపల్ సాధారణ నిధులతో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా బస్తీని అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు.

◆ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం



పటాన్‌చెరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తంగి, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర సాయుధ దళాల (ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్)బృందంతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడానికి కవాతు దోహదపడుతుందన్నారు. కవాతులో కేంద్ర ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ కరాటేతో ఆత్మరక్షణ

పటాన్‌చెరు: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడెం గ్రామ ప్రభుత్వ పాఠశాల భవనంలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు, బ్లాక్ బెల్ట్ విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు.

◆ తడి,పొడి చెత్తను వేరు చేయాలి

నారాయణఖేడ్: ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి చెత్త బుట్టల్లో ఉంచి చెత్త తరలింపు ఆటోల్లో వేయాలని ఖేడ్ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం 5వ వార్డులో తడి, పొడి చెత్తలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు.

◆ జోరుగా మట్టి అక్రమ రవాణా

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతోంది. మాదారం గ్రామశివారు వాగులో నుంచి శనివారం రాత్రి పెద్ద ఎత్తున మట్టి రవాణా చేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పోడుస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండల శివారు ప్రాంతమైన రోయ్యపల్లి నుంచి వారం రోజులుగా యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా సాగుతుంది. అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని వాపోయారు.

ఘనంగా పోచమ్మకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా గ్రామస్తులు



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో దుర్గమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్‌లో జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 వరకు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటిరోజు బొడ్రాయికి జలాభిషేకం, ముత్యాలమ్మ, రేణుకామాత, నల్లపోచమ్మ, కనకదుర్గమ్మలకు భక్తిశ్రద్ధలతో బానాలు ఊరేగింపు చేపట్టారు. పాడి, పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతలకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.